క్లుప్తంగా...

నేడు నవనాగుల యంత్ర, విగ్రహ పునఃప్రతిష్ఠాపన

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్ గురుమూర్తినగర్‌లోని వినాయక స్వామి దేవాలయంలో నవ నాగుల యంత్ర, విగ్రహ పునః ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్నట్లు ఎస్.నరేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శనివారం ఉదయం ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠాపన ఉంటుందని అనంతరం నవ నాగుల యొక్క పంచామృతాభిషేకములు, ప్రతిష్ఠా దేవతల యొక్క శాంతి పూర్వక హవనం, పూర్ణాహుతి నీరాజన మంత్ర, వేద ఆశీర్వచన పూజలు జరుగుతాయన్నారు.

బస్తీలో కార్పొరేటర్ పర్యటన



బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ జీవై కంపౌండ్ బస్తీ పక్కనున్న వక్ఫ్‌బోర్డు బస్తీలో శుక్రవారం కార్పొరేటర్ హేమలత పర్యటించారు. జలమండలి శివశంకర్, జీహెచ్ఎంసీ ఏఈ నవీన్ తదితరులతో కలిసి కార్పొరేటర్ హేమలత బస్తీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నీటి ఎద్దడి నివారించాలని, బస్తీలో ఎస్ఎస్ ఫ్లోరింగ్ వేయించాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం, డివిజన్ సమగ్రాభివృద్ధికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నామన్నారు. ముస్లిం బస్తీ ప్రజల సమస్యలను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. ప్రజాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపతి, నాగభూషణం, మహమూద్, కళావతి, మైసమ్మ, యూసుఫ్ పాల్గొన్నారు.

పోలీసు కస్టడీకి బంగారం కేసు నిందితులు

రాంగోపాల్‌పేట్: ఐటీ అధికారులమని చెప్పి పాట్ మార్కెట్‌లోని బాలజీ జువెలర్స్‌లో కిలో 700 గ్రాముల బంగారు బిస్కెట్లు ఎత్తుకెళ్లిన కేసులో నలుగురి నిందితులను మార్కెట్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. గత నెల 27న మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరగ్గా పోలీసులు రెహ్మాన్, జాకీర్, ఆకాష్, ప్రవీణ్‌ను అరెస్టు చేసిన సంగతి విదితమే. నిందితులు గతంలో ఏవైనా కేసుల్లో నిందితులుగా ఉన్నారా, ఇంకా వేరే చోట్ల ఇలాంటి దోపిడీలకు పాల్పడ్డారా, ప్రస్తుత కేసులో మిగతా నిందితుల వివరాలు, చోరీకి గురైన బంగారం గురించి ప్రశ్నించనున్నారు. ఈ నెల 15వ తేదీ వరకు నిందితులను విచారించేందుకు కోర్టు అనుమతిచ్చింది.

పేదలకోసం నిర్మించారు.. ప్రభుత్వ కార్యాలయాలుగా మార్చారు

- పరాధీనం అవుతున్న కమ్యూనిటీ హాళ్లు
- రోడ్లపైనే శుభకార్యాలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లష్కర్ ప్రజలు

సికింద్రాబాద్: శుభకార్యాలు, ఇతరత్రా సామాజిక కార్యక్రమాల కోసం నిర్మించిన సామాజిక భవనాలు క్రమేణా పరాధీనం అవుతున్నాయి. బస్తీలు, కాలనీల ప్రజలు చిన్నపాటి శుభకార్యాల నిర్వహణ, అదే మాదిరిగా ఆయా ప్రాంతాల ప్రజలకు సామాజిక అవగాహన కలిగించే కార్యక్రమాలు నిర్వహించడం కోసం కమ్యూనిటీ హాళ్లను ప్రభుత్వం నిర్మించి ఇచ్చింది. బస్తీలు, మధ్యతరగతి కాలనీల్లో నివసించే ప్రజలు పదేళ్ల క్రితం వరకు చిన్నపాటి శుభకార్యాలను అడ్డంగా పరదాలు కట్టి రహదారులపైనే నిర్వహించుకునేవారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని కాలనీలు, బస్తీల్లో క్రమేణా పలు కమ్యూనిటీహాళ్లు అందుబాటులోకి వచ్చాయి. కేవలం రూ.100 ఖర్చుతోనే సమీపంలోని కమ్యూనిటీహాళ్లలో శుభకార్యాలు నిర్వహించుకునేవారు. జీహెచ్ఎంసీ, ఎమ్మెల్యే, ఎంపీలాడ్స్ నిధులతో అవసరమైనన్నీ కమ్యూనిటీ హాళ్లు అందుబాటులోకి వచ్చాయి. కారణాలు ఏవైనా ఇటీవల ఆయా ప్రాంతాల్లో నిర్మించిన కమ్యూనిటీహాళ్లు పేద ప్రజల అవసరాలకు దూరమవుతున్నాయి.

20 కమ్యూనిటీ హాళ్లు..

పేద ప్రజల ఆవాసాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్న కమ్యూనిటీ హాళ్లు కొన్ని నెలలుగా వివిధ విభాగాల ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిపోయాయి. ప్రభుత్వ అధికారులు వారి విధినిర్వహణ కోసం సామాజిక భవనాలను ప్రభుత్వ కార్యాలయాలుగా మార్చేసుకుంటున్నారు. నియోజకవర్గంలోని దాదాపు 20 వరకు కమ్యూనిటీళ్లను ఇప్పటికే వివిధ విభాగాల ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. పేద ప్రజలకు పెద్దదిక్కుగా ఉండే బౌద్ధనగర్‌లోని జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్ పోలీసు శాఖ వశమైంది. అందులో వారాసీగూడ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇందిరానగర్ కమ్యూనిటీహాల్లో వార్డు కార్యాలయం, మేడిబావి కమ్యూనిటీ హాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులు ఏర్పాటు చేశారు. ఫ్రైడే మార్కెట్ సమీపంలోని శ్రీనివాస్‌నగర్ కమ్యూనిటీ హాల్లో చిలకలగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొనసాగుతుంది. ఐదు డివిజన్లలోని 9 కమ్యూనిటీ హాళ్ల నుంచి బస్తీ దవాఖానాల సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న బీదలబస్తీ కమ్యూనిటీహాల్‌ను చేజిక్కించుకునేందుకు చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు, కుట్టివెల్లోడి ఆసుపత్రి వర్గాలు పోటీ పడుతున్నారు.



వారాసీగూడ పోలీస్ స్టేషన్‌గా మారిన బౌద్ధనగర్‌లోని జీహెచ్ఎంసీ కమ్యూనిటీహాల్

పెద్ద దిక్కుగా రెండు..

సీతాఫల్‌మండి, మెట్టుగూడ, బౌద్ధనగర్ డివిజన్లలో నిర్మించిన సామాజిక భవనాలు అన్నీ ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు అంకితమైపోయాయి. ఈ ప్రాంతంలో రెండు జీహెచ్ఎంసీ హాళ్లు మాత్రమే ప్రజల శుభకార్యాల కోసం మిగిలాయి. సీతాఫల్‌మండి టీఆర్‌టీ ప్రాంతంలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలు, మధురానగర్‌లోని ఓ మోస్తరు కమ్యూనిటీహాల్ మాత్రమే ప్రజల అవసరాల కోసం మిగిలి ఉన్నాయి. అయితే ఈ రెండు భవనాల్లో శుభకార్యాలు నిర్వహించడం పేదకు భారంగా మారింది. జీహెచ్ఎంసీ అద్దె నామమాత్రంగానే ఉన్నా టెంట్‌హౌజ్ సామగ్రి, అలంకరణ, లెబర్ ఖర్చుల పేరిట మొత్తంగా రూ.30–40 వేల వరకు వసూలు చేస్తున్నట్టు ఆరోపణ ఉన్నాయి.దీంతో చిన్నపాటి శుభకార్యాలు ఇక్కడ నిర్వహించడం తలకు మించిన భారంగా మారుతుంది.

తిరిగి అప్పగించాలి..

ప్రజల అవసరాల కోసం నిర్మించిన సామాజిక భవనాలను ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు వినియోగించుకోవడంతో స్థానికంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మించుకోవాలి.. లేదంటే అద్దె భవనాలు వినియోగించుకోవాలి కానీ ప్రజలకు ఉపయోగకరంగా ఉండే కమ్యూనిటీహాళ్లను స్వాధీనం చేసుకోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే.. అన్ని కార్యాలయాలకు కొత్త భవనాల నిర్మాణం కోసం సన్నాహాలు జరుగుతున్నాయని క్రమేణా సామాజిక భవనాలు ఆయా ప్రాంతాల ప్రజలకు అందిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

మార్చురీ దుర్వాసన రాకుండా చర్యలు చేపట్టాలి

గాంధీఆస్పత్రి : గాంధీ మార్చురీ నుంచి వచ్చే దుర్వాసనతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే ఆస్పత్రి పాలనాయంత్రాంగం స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి కోరారు. శుక్రవారం గాంధీ ఆస్పత్రిని సందర్శించి సూపరింటెండెంట్ రాజారావుతో చర్చించారు. మార్చురీ నుంచి వెలువడే దుర్వాసనతో పరిసర ప్రాంత ప్రజలు అనారోగ్యానికి గురై ఇళ్లను వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారన్నారు. అనాథ మృతదేహాలు, పోలీస్ కేసులు నేపథ్యంలో కొన్ని మృతదేహాల తరలింపులో జాప్యం జరుగుతుందని సూపరింటెండెంట్ రాజారావు వివరించారు. జమ్మూ కశ్మీర్ మాజీ ఆరోగ్యశాఖ డీజీ, ఎన్‌డీఏ మాజీ సభ్యుడు ముజఫర్ అహ్మద్‌తో ఫోన్‌లో సూపరింటెండెంట్‌తో మాట్లాడించగా ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. వాహనాల పార్కింగ్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు, నిరుపేద రోగులు, వైద్యులకు ఆహార పదార్థాలు సరఫరా చేసే డైట్ క్యాంటీన్ తదితర సమస్యలను పరిష్కరించాలని మర్రి శశిధర్‌రెడ్డి కోరగా, దశలవారీగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని సూపరింటెండెంట్ రాజారావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, గుంటి సత్యనారాయణ, చంద్రపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, కిరీట, గోపీ, కుమార్, వెంకట్‌రాజ్, శ్రీనివాస్, నరేష్, నర్సింగరావు, పరమేశ్, వంశీ, నగేష్‌రెడ్డి పాల్గొన్నారు.



రాజారావుతో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఈవో మధుకర్ నాయక్, రామకృష్ణ

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ప్రతి యేడు బోర్డు పరిధిలోని పలు మైదానాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేలా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ అన్నారు. గత 45 రోజులుగా కొనసాగుతున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు శుక్రవారంతో ముగిసాయి. మడ్‌ఫోర్ట్ హాకీ మైదానంలో వాలీబాల్, క్రికెట్, కరాటే, తిరుమలగిరి ఫుట్‌బాల్ మైదానంలో ఫైనల్ పోటీల టోర్నమెంట్ నిర్వహించి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ, సీఈవో మధుకర్ నాయక్ బహుమతులు అందజేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. మొదటిసారి వేసవి క్రీడ శిక్షణ శిబిరాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. శిక్షణ పొందిన క్రీడాకారుల మధ్య టోర్నమెంట్ నిర్వహించి వారికి బహుమతులు అందజేశామన్నారు. శిక్షకులు విద్యార్థులను ప్రోత్సహిస్తు క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా కృషి చేశారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు శానిటరీ విభాగం సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఆకుల మహేందర్ ఇన్‌స్పెక్టర్లు అశుతోష్, పుష్పేందర్, అమిత్, ఎస్‌వో ప్రవీణ్, కోచ్ జనార్ధన్, దిలీప్ పాల్గొన్నారు.

105 గల్లీలో డ్రైనేజీ పైపులైన్ పనులు

రసూల్‌పురా: సొంత నిధులు వెచ్చించి రసూల్‌పురా 105గల్లీలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీ గణేష్ పేర్కొన్నారు. శుక్రవారం కమ్యూనిటీ హాల్ సమీపంలో భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల 105 గల్లీలో పర్యటించిన సందర్భంలో స్థానికులు నాలా రిటైనింగ్ వాల్, కమ్యూనిటీ హాల్‌కు విద్యుత్ కనెక్షన్లు, ఇతర కనీస వసతులు, బస్తీలో భూగర్భ డ్రైనేజీ పైపులైను అభివృద్ధి చేయాలని కోరారని చెప్పారు. ఇప్పటికే కమ్యూనిటీహాల్లో పలు మౌలిక వసతులు కల్పించామని నాలాకు రిటైనింగ్ వాల్ నిర్మించామని చెప్పారు. భూగర్భ డ్రైనేజీ పైపులైను సమస్యను బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని డ్రైనేజీ పైపులైను పనులకు అయ్యే ఖర్చులో 70 శాతం నిధులను బస్తీవాసులకు అందజేసి డ్రైనేజీ పైపులైను పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, మల్లేష్, సిద్దయ్య, లక్ష్మి, ఎలమ్మ, రాజు, పరశురాం పాల్గొన్నారు.



డ్రైనేజీ పైపులైను పనులను ప్రారంభిస్తున్న శ్రీ గణేష్

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలి

కంటోన్మెంట్: ఆర్టీసీ ఉద్యోగులు సంస్థ అభివృద్ధి మరింత కృషి చేయాలని సికింద్రాబాద్ రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి (ఆర్టీఓ) శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ డిపో మేనేజర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన కాలనీ బస్ ఆఫీసర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోటీ తీవ్రంగా ఉన్నప్పటికీ రవాణా రంగంలో ప్రభుత్వ రంగం సంస్థ అయిన ఆర్టీసీదే అగ్రస్థానం అన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూ సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు ఉద్యోగులు కృషి చేయాలన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రత్యేక చొరవతో చేపట్టిన కాలనీ బస్ ఆఫీసర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మేనేజర్ రామ్మోహన్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ప్రతీ రోజూ 30 లక్షల మంది ప్రయాణికులకు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తోందన్నారు. సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయడం ద్వారానే ప్రజల్లో ఆర్టీసీ పట్ల నమ్మకం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో మారేడుపల్లి ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర నాయక్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్లు యాఖూబ్, బాలరాజ్, శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రమణ, సూపర్ వైజర్లు ముత్యాలు, సీఎస్ రెడ్డి పాల్గొన్నారు.



కిట్ బ్యాగు అందజేస్తున్న ఆర్టీఓ శ్రీనివాస్ రెడ్డి

ముదిరాజ్‌లపై వివక్ష తగదు

సనత్‌నగర్: బీసీలకు రూ. లక్ష రుణం ఇస్తున్నట్లు ప్రకటించిన తెలంగాణ సర్కార్.. ఆ జాబితాలో ముదిరాజ్‌లను చేర్చకపోవడం విచారకరమని ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గోనెల కుమారస్వామి ముదిరాజ్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ముదిరాజ్‌ల పట్ల ప్రభుత్వం ఎందుకంత వివక్ష చూపుతుందో సమాధానం చెప్పాలన్నారు. చేపల పంపిణీలోనూ ముదిరాజ్‌లకు వివక్ష ఎదురైందని రుణాలకు దరఖాస్తు చేసుకునే సమయాన్ని తక్కువగా ఇచ్చి బహుజనులను అవమానించేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆరోపించారు. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏ జాబితాలోకి చేర్చే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అడ్డగుట్ట: అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగరాజు వివరాల ప్రకారం.. శాంతినగర్‌లోని బ్లూ మూన్ హోటల్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం 40– 45 ఏళ్ల వయస్సు గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని సదరు వ్యక్తికి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

రైల్లో నుంచి పడి రైతు మృతి

సికింద్రాబాద్: చర్లపల్లి–ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించగా ఆదిలాబాద్ జిల్లా బ్రహ్మంగావ్ గ్రామానికి చెందిన రైతు నడికుడ గంగాధర్ (48)గా గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

'దళితబంధు'లో మాలలకు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: దళితబంధు పథకం అమలులో మాలలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షులు నామ సైదులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత బంధు మొదటి విడతలో మాలలకు కనీసం 20 శాతం కూడా ఇవ్వలేదని రెండు విడత లో అయినా 50 శాతం మంది మాలలకు దళిత బంధు ఇవ్వాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నుంచి మాలల పై ప్రభుత్వం వివక్షత చూపుతుందని ఎస్సీ కార్పొరేషన్ బెనిఫిట్స్, భూ పంపిణీ, డబుల్ బెడ్రూమ్ తదితర పథకాల పంపకంలో వ్యత్యాసాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యంలో కూడా మాలలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ పథకాల పంపిణీలో మాల, మదిగ, ఉపకులాలకు సమాన పంపిణీ జరగాలని కోరారు.

విరివిరిగా మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న దృశ్యం

అడ్డగుట్ట: పర్యావరణ పరిరక్షణకు మొక్కలను విరివిగా నాటాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్. లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం, పాఠశాల యాజమాన్య కమిటీల ఆధ్వర్యంలో 'ఈచ్ వన్, ప్లాంట్ వన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రస్తుతం నగరమంతా కాలుష్యంతో నిండిపోతుందని, ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా తమ ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటాలన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా బడి బయటి పిల్లలందరినీ గుర్తించి బడుల్లో చేర్పించాలని తీర్మానించినట్లు తెలిపారు. 'మద్యం, మాదకద్రవ్యాల నుంచి మన బాలలకు రక్షించుకుందాం' అనే నినాదంతో ఈ నెల 14న తుకారాంగేట్ నుంచి అడ్డగుట్ట వరకు నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి, సీఆర్పీఎఫ్ మాజీ కన్వీనర్ సత్తయ్యగౌడ్, మండల కన్వీనర్ ప్రవీణ్ కుమార్, మండల ఎస్ఎంసీ కన్వీనర్ గోపి, సభ్యులు లక్ష్మి, రామలీల, రమేష్, జనార్దన్, బాలమణి, పుష్ప పాల్గొన్నారు.

ఆయుర్వేద ఔషధం పంపిణీ

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన సాయిబాబా దేవాలయంలో శుక్రవారం మృగశిర కార్తె సందర్భంగా ఆయుర్వేద ఔషధం పంపిణీ చేశారు. డాక్టర్ సాయిబాబా వ్యాధి నివారణ ఆశ్రమంలో అస్తమా వ్యాధితో బాధ పడుతున్న రోగులతో పాటు సామాన్యులకు ఔషధాన్ని పంపిణీ చేశారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది ఆలయం ముందు బారులు తీరి ఆయుర్వేద ఔషధాన్ని వేయించుకున్నారు. అస్తమా వ్యాధితో బాధపడుతున్న వారికి ఈ మందు ఎంతో బాగా పని చేస్తుందన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి వందలాది మందికి ఉచితంగా ఈ ఆయుర్వేద ఔషధాన్ని అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతామా, జ్యోతిర్మా, డాక్టర్ శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆయుర్వేద ఔషధం వేస్తున్న దృశ్యం

శక్తి ప్రదర్శన సభను జయప్రదం చేయాలి



సభలో పాల్గొన్న వక్తలు

సికింద్రాబాద్: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించడం కోసం నిర్వహిస్తున్న మాదిగల శక్తి ప్రదర్శన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం సీతాఫల్‌మండిలోని బీఎస్ఆర్ గార్డెన్‌లో సీతాఫల్‌మండి ఎంఆర్‌పీఎస్ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ హామీని ఎన్నికల మెనిఫెస్టోలో పెడుతున్న రాజకీయ పార్టీలు అధికారంలోకి రాగానే అమలు చేయడాన్ని విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించడం కోసం అధికార పార్టీలపై ఒత్తిడి తెచ్చేందుకు మాదిగల శక్తిని మరోమారు నిరూపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ఈ నెల 17న ఖైరతాబాద్‌లో మంద కృష్ణమాదిగ నేతృత్వంలో జరగనున్న మాదిగల శక్తి ప్రదర్శన సభను విజయవంతం చేయాలన్నారు. మల్లికార్జున్, యాదగిరి, సీతారాం, శ్యాం, ఎల్లయ్య, రమేశ్, మహేశ్, సాయికుమార్ పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రెజ్లర్లకు మద్దతుగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఓయూలో మహిళలు ర్యాలీ చేపట్టారు. క్రీడాకారిణులపై లైంగిక దాడికి పాల్పడిన ఎంపీ బ్రిజ్ భూషణ్ వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ, పీవోడబ్ల్యూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కావేరి, అనసూయ, అనిత, రంజిత్, శ్రీకాంత్, మహేష్, పుష్ప పాల్గొన్నారు.



ఓయూలో మహిళల ర్యాలీ

సివరేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం




పనులు ప్రారంభిస్తున్న పద్మారావుగౌడ్

చిలకలగూడ : మెట్టుగూడ డివిజన్ చింతబావిలో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించనున్న సివరేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను శుక్రవారం డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చింతబావిని సమస్యల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. సివరేజీ పైప్‌లైన్ నిర్మాణం పూర్తయిన వెంటనే అంతర్గత రహదారులను నిర్మిస్తామన్నారు. ఇటీవల చింతబావిలో సరఫరా అయిన కలుషిత జలాలతో సుమారు 350 మంది బస్తీవాసులు అస్వస్థతకు గురికాగా తక్షణమే స్పందించి నూతన పైప్‌లైన్లు, రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించిన డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌కు స్థానిక కార్పొరేటర్ సునీత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం సరిత, సెక్షన్ మేనేజర్లు నిఖిత, విశ్వతేజ, బీఆర్ఎస్ నాయకులు కిషోర్‌కుమార్, రామేశ్వర్, వంజరి సతీష్, జగదీష్, కృష్ణ, సమన్వయకర్త రాజుసుందర్ పాల్గొన్నారు.

నిజామియా అబ్జర్వేటరీ పునరుద్ధరణ

సాక్షి, సిటీబ్యూరో: వాతావరణ పరిశోధనల కోసం నిజాం హయాంలో బేగంపేట్‌లో ఏర్పాటు చేసిన నిజామియా అబ్జర్వేటరీ భవనాన్ని పునరుద్ధరించనున్నట్లు హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ తెలిపారు. ఆరో నిజాం మహబూబ్ అలీఖాన్ కాలంలో రక్షణశాఖ మంత్రిగా పనిచేసిన 1907లో నవాబ్ జాఫర్ యార్ జంగ్ బహదూర్ ఇంగ్లండ్ నుంచి తిరిగి వస్తూ ఒక చిన్న టెలిస్కోప్‌ను వెంట తెచ్చారు. 15 ఇంచుల డయామీటర్, 8 ఇంచుల కూక్ ఆస్ట్రోగాఫిక్ కెమెరా కలిగిన ఈ టెలిస్కోప్‌ను ఈ అబ్జర్వేటరీలో ఏర్పాటు చేశారు. వాతావరణ శీతోష్ణస్థితి గతులను తెలుసుకొనేందుకు దీన్ని వినియోగించేవారు. ఒక టవర్ ఆకారంలో నిర్మించిన ఈ అబ్జర్వేటరీ భవనం శిథిలావస్థకు చేరడంతో ఒకప్పటి ప్రాభవాన్ని కోల్పోయింది. ప్రస్తుతం దీనికి పూర్వవైభవం తెచ్చేవిధంగా పునరుద్ధరణ చర్యలు చేపట్టనున్నట్లు అర్వింద్‌కుమార్ తెలిపారు.



కులాంతర వివాహాలకు ప్రోత్సాహకాల పంపిణీ



ప్రోత్సాహకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: కులాంతర వివాహాలు చేసుకుని ఒక్కటైన దంపతులకు శుక్రవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రోత్సాహకాల పంపిణీ జరిగింది. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా కులాంతర వివాహాలు చేసుకున్న 11 జంటలకు రూ. 2.50 లక్షల బ్యాంకు డిపాజిట్ బాండ్లను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ సామల హేమ బాండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో దశాబ్ది వేడుకల నోడల్ అధికారి నర్సింగ్, ఎస్సీ ఎస్టీ హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎల్లమ్మ, డిప్యూటీ స్పీకర్ కార్యదర్శి రాయబాగి గోపాలకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు బోల్ల సుమీత్‌యాదవ్, అమర్ పాల్గొన్నారు.